ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణమాస సంబురాలు

ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆశ క్యాకర్తలు

కృష్ణ , సెప్టెంబర్ 11 : ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఈనెల ఒకటి నుంచి 30 వరకు పోషణ మాససంబరాలకు అందరూ సహకరించి తీవ్ర లోపపోషణ పిల్లలను శ్యాం పిల్లలను అంగన్‌వాడీ టీచర్లు హెల్త్ డిపార్ట్మెంట్ సమన్వయంతో ఫాలోఅప్ చేయాలని సీడీపీవో సరోజిని సూచించారు. ఈ సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పోషణ మాస సంబరాల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మహేశ్వరి, రాజేశ్, ఏఎన్ఎం అల్వేలమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలతోపాటు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం అందించాలి..

ధన్వాడ, సెప్టెంబర్ 11 : పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే తల్లిదండ్రులు వారికి పోషకాహారం అందించాలని ఎంపీడీవో సాయిప్రకాశ్ సూచించా రు. బుధవారం మండలంలోని గోటూరు అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. కా ర్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శేఖర్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రకళ, హెల్త్ సూపర్‌వైజర్ శోభారాణి, టీచర్లు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పులు సరిచేసుకోండి

దేవరకద్ర, సెప్టెంబర్ 11 : ఓటరు లిస్టులో ఎమైనా తప్పులుంటే సరి చే సుకోవాలని ఎన్నికల అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ముకుందరెడ్డి సూచించారు. బుధవారం తాసీల్దార్ కార్యాలయంలో వివిధ పార్టీ నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు లిస్టులో కుటుంబసభ్యుల పేర్లు ఒకే పోలింగ్ బూత్‌లో ఉండేవిధంగా చూసుకోవాలని, అదేవిధంగా 18 ఏండ్లు నిండిన యువత ఓటరు నమోదు కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

25న జిల్లా స్థాయి సాంస్కృతిక పోటీలు

మహబూబ్‌నగర్ అర్బన్, సెప్టెంబర్ 11 : జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో ఈ నెల 25వ తేదీన జిల్లా స్థాయి సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నట్లు డీవైఎఫ్‌వో శ్రీనివాస్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో జానపద నృత్యం, జానపద గీతాలు(గ్రూప్, సింగిల్), వ్యాసరచన, పెయింటింగ్, ఉపన్యాసం, కవిత్వం, హ్యాండ్ క్రాఫ్ట్, ఆగ్రో ప్రొడక్ట్స్ ఉత్పత్తుల పాల్గొనే యువతీయువకులు 15నుంచి 29 ఏండ్లలోపు ఉన్న వారు అర్హులన్నారు. 9441565895 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రైతుధర్నాను జయప్రదం చేయాలి

మాగనూరు, సెప్టెంబర్ 11 : అర్హులైన రైతులకు పంట రుణమాఫీ చేయాలని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 13న కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆంజనేయులు అన్నారు. మాగనూరులో సమావేశంలో ధర్నా కరపత్రాలను విడుదల చేశారు. భరత్‌కుమార్, వెంకటయ్య, రైతులు పాల్గొన్నారు.

ఇబ్రహీంబాద్ వద్ద వర్షాలకు తెగిపోయిన కల్వర్టు (ఫైల్)

తెగిన రోడ్డు సంబంధాలు

- మహబూబ్‌నగర్–తాండూర్ మధ్య నిలిచిన రాకపోకలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, ప్రయాణికులు
- ఉద్యోగులు, విద్యార్థులకు తప్పని తిప్పలు
- పది రోజులుగా ప్రజల అవస్థలు

మహ్మదాబాద్/ గండీడ్ సెప్టెంబర్ 11 : మహబుబ్‌నగర్–తాండూరు ప్రధాన రహదారిని హైవేగా ప్రకటించి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పనులు చకాచకా కొనసాగగా కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పనులు నత్తనడకన సాగుతున్నాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల ప్రతి గ్రామం వద్ద సర్వీస్ రోడ్డు అసంపూర్తిగా వదిలేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి మండల పరిధిలోని ఆయా గ్రామాల వద్ద కనీసం కల్వర్టు పనులు పూర్తిస్థాయిలో చేపట్టకపోవడంతో వర్షాలు వచ్చిన ప్రతిసారీ ప్రజలు పడరానిపాట్లు పడుతున్నారు. పది రోజుల కిందట కురిసిన భారీ వర్షానికి తాండూరు- మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపై బ్రిడ్జి పనులు అసంపూర్తిగా ఉండడమే కాకుండా తాత్కాలికంగా ఏర్పాటు చేసి రోడ్డు సైతం కొట్టుకుపోవడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. రెండు రోజులపాటు మహ్మదాబాద్ మండలకేంద్రం పూర్తిగా జలదిగ్బంధంలో ఉండిపోయింది. పది రోజుల పాటు రాకపోకలు నిలిచిపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మహ్మదాబాద్ నుంచి హన్వాడ మండలం మధ్యలో దాదాపు 8 కల్వర్టులు నిర్మాణంలో ఉన్నాయి. వాటి పక్కన వాహనాలు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన కల్వర్టులను ముందు చూపు లేకుండా రెండు మూడు పెద్ద పైపులు వేసి చేతులు దులుపుకున్నారు. దీంతో ఈ మధ్య కురిసిన భారీ వర్షాలకు ఇబ్రహీంబాద్ దగ్గర కల్వర్టు పూర్తిగా తెగిపోయింది. గంగర్లపాడ్ దగ్గర్ మరో కల్వర్టు కూడా తెగిపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

తెగడానికి సిద్ధంగా ఉన్న మరో కల్వర్టు..

మహ్మదాబాద్ సమీపంలో నూతన బస్టాండు సమీపంలో వాగుపై కల్వర్టు నిర్మాణం చేపట్టారు. దీంతో వాహనాలు అటు ఇటు పోవడానికి తాత్కాలికంగా రెండు వైపులా కల్వర్టులు ఏర్పాటు చేశారు. వారం రోజుల కిందట మల్కచెరువు నిండడంతో చెరువు అలుగు నీటి ప్రవాహంతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కల్వర్టులు తెగిపోయే సూచనలు కన్పిస్తున్నాయి. ప్రమాదం పొంచి ఉందని తెలిసి కూడా అధికారులు, కాంట్రాక్టర్లు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

పది రోజులుగా నిలిచిన రాకపోకలు

మహబూబ్‌నగర్–తాండూరు మధ్యనున్న తాత్కాలిక కల్వర్టులు తెగిపోవడంతో తాండూరు, కోస్గి, కొడంగల్, గండీడ్, మహ్మదాబాద్ తదితర ప్రాంతాలకు పది రోజులపాటు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఆయా ప్రాంతాల నుంచి మహబూబ్‌నగర్‌కు కళాశాలలకు విద్యార్థులు వెళ్లలేక పోయారు. అదేవిధంగా ఉద్యోగులు సైతం విధులకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన దుస్థితి దాపురించింది.

నిలిచిపోయిన రేషన్ బియ్యం..

ప్రతి నెలా 1వ తారీకు నుంచి ప్రజలకు సరఫరా అయ్యే రేషన్ బియ్యం పంపిణీ 8వ తేదీ దాటినా ఇప్పటి కొన్ని గ్రామాలకు రేషన్ బియ్యం ఆయా గ్రామాలకు చేరకపోవడంతో ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారు. ఉమ్మడి మండలంలో 46 రేషన్ షాపులకు గానూ 3,300 క్వింటాల్ల రేషన్ బియ్యం సరఫరా కానుండడంతో రోజుకు ఒకటి లేదా రెండు గ్రామాలకు మాత్రమే లారీల ద్వారా బియ్యం పంపిణీ చేస్తున్నారు. అది కూడా 60కిలో మీటర్లు చుట్టూ తిరిగి లారీలు గ్రామాలకు చేరుకొనే సరికి ఒక రోజు మొత్తం పడుతున్నది. ధర్మాపూర్, అన్నారెడ్డిపల్లి, రుసుంపల్లి, జక్లపల్లి, లింగాయిపల్లి తదితర గ్రామాలకు ఇప్పటి వరకు రేషన్ బియ్యమే చేరలేదు. దీని అంతటికీ వర్షం వల్ల రవాణా వ్యవస్థ చిన్నాభిన్నం అవ్వడమే ప్రధాన కారణం.

గంగర్లపాడ్ దగ్గర తూతూ మంత్రంగా ఏర్పాటు చేసిన కల్వర్టు

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే..

రోడ్డు విస్తరణ పనుల్లో కల్వర్టుల దగ్గర మూడు పైపులు వేస్తే వరద తాకిడికి తట్టుకోలేక రోడ్లు తెగిపోతున్నాయి. రోడ్డు విస్తరణ చేయిస్తున్న ఇంజినీర్లు, కాంట్రాక్టర్లకు ముందు చూపు లేకపోవడం వల్లే ఇలాంటి పరిస్థితి దాపురించింది. మండల నాయకులు, ప్రజలు అందరూ కలిసి రోడ్ల పరిష్కారం చేసుకోవడానికి ముందుకు రావాలి. పది రోజులు గడుస్తున్నా మహబూబ్‌నగర్–తాండూర్ మధ్య రవాణా సౌకర్యాలు లేక వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, కాంట్రాక్టర్లు స్పందించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి.

– వేణుగౌడ్, మహ్మదాబాద్

పనికి వెళ్లలేక పోతున్నాం..

రోడ్లపై పారుతున్న వరద నీటితో బైక్‌పై వెళ్లాలంటే కూడా భయం వేస్తోంది. కల్వర్టుల దగ్గర తాత్కాలిక కల్వర్టులు ఎప్పుడు తెగి పోతాయో తెలియని పరిస్థితి. ప్రతి రోజూ హన్వాడ వెళ్లి పని చేసుకొనె నేను రోడ్డు ఇబ్బందులతో పనికి వెళ్లలేక పోతున్నా.. మరో పది రోజులు ఇలాగే ఉంటే జీవనోపాది పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉంది. అధికారులు, కాంట్రాక్టర్లు స్పందించి రోడ్డు సౌకర్యాన్ని వెంటనే మెరుగుపర్చాలి.

– శ్రీకాంత్, మహ్మదాబాద్

బియ్యం అందించలేదు..

వర్షాలకు రోడ్లు తెగిపోవడంతో బియ్యం లారీలు రాలేకపోయాయి. ఉమ్మడి మండలంలో అన్ని గ్రామాలకు రేషన్ బియ్యం చేరాలంటే హన్వాడ మండలం కొత్తాబాద్ మీదుగా చుట్టూ తిరిగి రావాల్సి వస్తోంది. వేలిముద్ర పెట్టడానికి గోదాంకు వెళ్లాలంటే బస్సులు కూడా లేక ఇబ్బందులు పడుతున్నారు. సకాలంలో బియ్యం పంపిణీ చేయలేకపోతున్నాం.

– రఘు, డీలర్ల సంఘం మండల కార్యదర్శి, మహ్మదాబాద్

పీఆర్టీయూ సభ్యత్వ నమోదు

మద్దూరు (కృష్ణ), సెప్టెంబర్ 11 : మండలంలోని గుడెబల్లూర్, ముడుమాల తదితర గ్రామాల్లో బుధవారం పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు వీరుపక్షప్ప పటేల్, ప్రధాన కార్యదర్శి శేఖర్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లాప్రధాన కా ర్యదర్శి జనార్దన్‌రెడ్డి, జిల్లాగౌరవ అధ్యక్షుడు తిరుపతి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. సంతోషి, తిరుమలరావు, సిద్ధిలింగప్ప పటేల్, నాగరాజు, చంద్రశేఖర్, శ్రీనివాసులు, నరేందర్ పాల్గొన్నారు

చికిత్స పొందుతూ బాలిక మృతి

మహ్మదాబాద్, సెప్టెంబర్ 11 : తండ్రి మందలించాడని ఓ బాలిక ఆత్మహత్యాయత్నం చేసుకోగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని దేశాయిపల్లి గ్రామానికి చెందిన దొంగల కృష్ణయ్య కూతురు శ్రీలత (14) పుట్టిన రోజు సందర్భంగా 9వ తేదీన తన తల్లి చంద్రకళ వద్ద రూ.200 తీసుకొని చాక్లెట్లు కొనుక్కొని పాఠశాలలో తనతోటి విద్యార్థులకు పంచి పెట్టింది. ఈ విషయం తండ్రి కృష్ణయ్య కు తెలియగా చాక్లెట్లకు డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయని కూతుని మందలించడంతో అదే రోజు ఇంట్లో ఉన్న ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నది. గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం మహబుబ్‌నగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. రెండు రోజులుగా చికిత్స పొందుతున్న బాలిక బుధవారం ఉదయం మృతి చెందింది. మృతురాలి తల్లి చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

మహ్మదాబాద్, సెప్టెంబర్ 11 : మండలంలోని నంచర్లగేట్‌లో వెంకటేశ్ అనే వ్యక్తి తన షాపులో రేషన్ బియ్యం వ్యాపారం చేస్తున్నాడనే సమాచారంతో బీట్ సిబ్బంది తనిఖీలు చేయగా, 16 సంచుల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా రేషన్ బియ్యం వ్యాపారం చేయడం నేరమని సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి వెల్లడించారు.

పడేసిన బ్లూచిప్

సెన్సెక్స్ 398, నిఫ్టీ 122 పాయింట్ల పతనం

ముంబై, సెప్టెంబర్ 11: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడోరోజు నష్టాలోకి జారుకున్నాయి. బ్లూచిప్ సంస్థల షేర్లు కుప్పకూలడంతో ప్రారంభంలో లాభపడిన సెన్సెక్స్ చివర్లో భారీగా నష్టపోయింది. అటు నిఫ్టీ తన 25 వేల మార్క్ దిగువకు పడిపోయింది. టాటా మోటర్స్, రిలయన్స్, ఎల్ అండ్‌టీ షేర్లలో అమ్మకాలు పోటెత్తడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలు నష్టాలవైపు నడిపించాయి. ఇంట్రాడేలో 500 పాయింట్ల వరకు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 398.13 పాయింట్లు కోల్పోయి 81,523.16 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 122.65 పాయింట్లు కోల్పోయి 24,918.45 వద్ద ముగిసింది. 30 షేర్ల ఇండెక్స్‌లో టాటా మోటర్స్ అత్యధికంగా 6 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది. ఎన్‌టీపీసీ, అదానీ పోర్ట్స్, ఎల్‌అండ్‌టీ, ఎస్బీఐ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ కూడా నష్టపోయాయి. కానీ, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌యూఎల్, బజాజ్ ఫిన్‌సర్వ్‌లు మాత్రం లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ క్రూడాయిల్ ధర 70 డాలర్ దిగువకు పడిపోయినప్పటికీ ఆసియా మార్కెట్లలో కరెక్షన్ జరిగిందని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. చైనా ఆర్థిక వ్యవస్థ మందగిస్తున్నదన్న వార్తలు మార్కెట్ సెంటిమెంట్‌ను నిరాశపరిచిందన్నారు. రంగాలవారీగా ఆయిల్ అండ్ గ్యాస్ 2.25 శాతం, మెటల్ 1.35 శాతం, యుటిలిటీ 1.29 శాతం, ఆటో 1.17 శాతం, కమోడిటీస్ 1.14 శాతం, టెలికం రంగ షేర్లు కుదేలయ్యాయి.

డిసెంబర్ 11 నుంచి 'భూమా కొనెక్స్‌పో'

హైదరాబాద్, సెప్టెంబర్ 11(నమస్తే తెలంగాణ): అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫ్యాక్చరర్స్‌తో కలిసి 'మెస్సె ముంచన్ ఇండియా' సంస్థ ఆధ్వర్యంలో డిసెంబర్ 11 నుంచి 14 వరకు గ్రేటర్ నోయిడాలో 'భూమా కొనెక్స్‌పో ఇండియా' జరుగుతున్నది. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఆహ్వానం అందింది. ఈ మేరకు బుధవారం సచివాలయంలో మంత్రితో ఈ కమిటీ భేటీ అయ్యింది. ఈ ఎక్స్‌పోలో ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలకు చెందిన వెయ్యికి పైగా సంస్థలు పాల్గొని తమ ఉత్పత్తులను ప్రదర్శించనున్నాయి. ఈ కార్యక్రమాన్ని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభించనున్నారు. నిర్మాణ రంగ పరికరాలు ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించనున్నారు.

మేకిన్ తెలంగాణే లక్ష్యం

ఏఐని అందరికీ అందుబాటులోకి తేవాలి • రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్రాన్ని ఉత్పాదక రంగంలో అగ్రగామిలా నిలిపేలా 'మేకిన్ తెలంగాణ' భావనను పెంపొందించాల్సిన అవసరం ఉందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పారిశ్రామిక రంగానికి పిలుపునిచ్చారు. దేశీయ మార్కెట్‌లో తెలంగాణ ఉత్పత్తులకు ఆదరణ ఉండేలా నాణ్యతకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా (క్యూసీఎఫ్ఐ) హైదరాబాద్ చాప్టర్ 38వ వార్షిక సదస్సును బేగంపేటలోని ఓ హోటల్‌లో ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు. పరిమాణంపైనే కాకుండా నాణ్యతకు ప్రాధాన్యతనిస్తే దేశమంతా మనవైపు చూస్తుందన్నారు. ఇక ఉద్యోగుల సృజనాత్మకతను వెలికితీసి ఆయా రంగాల్లో ఉత్పాదకతను పెంచేందుకు క్వాలిటీ ఫోరం చేస్తున్న కృషిని మంత్రి శ్రీధర్ బాబు అభినందించారు. 'క్యాంపస్ టు కార్పొరేట్' అనే మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించడం ప్రశంసనీయమని కొనియాడారు. క్వాలిటీ సర్కిల్ శిక్షణ కార్యక్రమాలకు సహకరించిన ఈసీఐఎల్, ఎన్ఎండీసీ, ఆర్టీసీ, థర్మోపాడ్స్, థర్మోకేబుల్స్, ఉషా ఇంటర్నేషనల్, టాటా గ్రూప్, రేణుకా ప్లాస్టిక్, తోషిబా, రామ్‌కో, కెసీపీ సిమెంట్స్, హెచ్ఎల్, మిథాని, బీఈఎల్ సంస్థలకు ఈ సందర్భంగా మంత్రి ప్రోత్సాహకాలు అందజేశారు.

క్యూసీఎఫ్ఐ సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

కృత్రిమ మేధను ప్రోత్సహిస్తాం

కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లేదా ఏఐ)ను అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని తెలంగాణ ప్రభుత్వం తన వంతు కృషి చేస్తోందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. రోజువారీ కార్యక్రమాల్లోనూ ఏఐ భాగమైపోయిందని, దీనిని మరింతగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తగిన విధానాలతో ముందుకుపోతోందని చెప్పారు. ఇందులో భాగంగానే విద్యార్థుల భవిష్యత్ అవసరాలు తీర్చేలా స్కిల్డ్ వర్శిటీల ఏర్పాటుకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఏఐ వినియోగంపై ఉద్యోగులు, కార్మికులు, పరిశ్రమ ప్రతినిధులకు అవగాహన కల్పిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఫోరం జాతీయ చైర్మన్ శ్యామ్ మోహన్, హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ బాలకృష్ణారావులు కూడా మాట్లాడారు.

వాణిజ్య

2 రోజుల్లో 1,000 అప్

మళ్లీ పెరుగుతున్న బంగారం ధరలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11: బంగారం మళ్లీ ప్రియమవుతున్నది. ప్రస్తుత పండుగ సీజన్‌కావడంతో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. దీంతో గడిచిన రెండు రోజుల్లో పుత్తడి ధర రూ.1,000 ఎగబాకింది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో తులం ధర మరో రూ.500 పెరిగి రూ.74,600 పలికింది. అంతకుముందు ఈ ధర రూ.74,100గా ఉన్నది. బంగారంతోపాటు వెండి కూడా పరుగులు పెట్టింది. పారిశ్రామికవర్గాలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ ఉండటంతో కిలో వెండి రూ.500 అధికమై రూ.85 వేలకు చేరుకున్నది. ఇటు హైదరాబాద్‌లో 22 క్యారెట్ తులం పుత్తడి ధర రూ.380 అధికమై రూ.67,150కి చేరుకోగా, 24 క్యారెట్ ధర రూ.410 ఎగబాకి రూ.73,250కి చేరుకున్నది. అలాగే కిలో వెండి రూ.500 ఎగబాకి రూ.91,500 పలికింది. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ ధర 2,550.90 డాలర్లు పలుకగా, వెండి 29.11 డాలర్లకు చేరుకున్నది.

మళ్లీ భారత్‌కు ఫోర్డ్?

న్యూఢిల్లీ/చెన్నై, సెప్టెంబర్ 11: భారతీయ మార్కెట్‌కు గుడ్‌బై చెప్పిన అగ్రరాజ్యం ఆటో దిగ్గజం ఫోర్డ్.. త్వరలోనే రీఎంట్రీ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అమెరికా పర్యటనలో ఉన్న తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలి